నిర్మాణాత్మక పెట్టుబడులు తీసుకురండి

- కేసీఆర్ దార్శనికతతో ప్రపంచ దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌కు వచ్చాయి
- అదే స్ఫూర్తితో సీఎం రేవంత్ బృందం అమెరికా టూర్ విజయవంతం కావాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో భాగంగా తెలంగాణ నిర్మాణాత్మక ప్రగతికి దోహదపడేలా పెట్టుబడులు తీసుకొనిరావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆకాంక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బృందం తలపెట్టిన అమెరికా, దక్షిణ కొరియా పర్యటన విజయవంతం కావాలని ఆదివారం ఒక ప్రకటనలో అభిలషించారు. గత పదేండ్లలో అనేక మల్టీ నేషనల్ కంపెనీలను, ప్రపంచ దిగ్గజ సంస్థలను హైదరాబాద్‌కు తీసుకు రాగలిగామని వివరించారు. ఆయా కంపెనీలతో తెలంగాణకు ప్రత్యేక అనుబంధం ఏర్పరచగలిగామని ఉదహరించారు.రాష్ట్రంలో ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న దిగ్గజ కంపెనీలతో తెలంగాణకు బలమైన వ్యాపార బంధం ఏర్పడిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన వ్యాపార, వాణిజ్య విధానాలు, టీఎస్ ఐపాస్ అనుమతుల ప్రక్రియ వంటి వాటి వలన ఇప్పటికే తెలంగాణకు తాము తీసుకొచ్చిన కంపెనీలు తమ విస్తరణ ప్రణాళికలో కూడా రాష్ట్రానికి ప్రాధాన్యం ఇస్తున్నాయని కేటీఆర్ గుర్తుచేశారు.

కేసీఆర్ సారథ్యంలో విప్లవాత్మక విధానాలు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో పదేండ్లలో విధానపరమైన, విప్లవాత్మక నిర్ణయాలతోపాటు మౌలిక వసతుల కల్పన ద్వారా తెలంగాణకు పెట్టుబడుల ఆకర్షణలో ప్రత్యేక స్థానాన్ని కల్పించగలిగామని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.నాలుగు లక్షల కోట్లకుపైగా పెట్టుబడులను తీసుకురావడంతోపాటు 24 లక్షల ఉపాధి అవకాశాలను ప్రైవేటు రంగంలో సృష్టించిన విషయాన్ని ఉదహరించారు. ముఖ్యమంత్రి ప్రతినిధి బృందం ఇలాంటి కంపెనీలతో మరోసారి చర్చలు నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆకాంక్షించారు. ప్రస్తుత ప్రభుత్వం తాము దశాబ్ద కాలంగా నిర్మించిన బలమైన పెట్టుబడుల పునాదులపై మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పించాలని అభిలషించారు.

జాబ్ లేదు.. క్యాలెండర్ లేదు

- నిరుద్యోగులపై పోలీసుల నియంతృత్వం
- బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో జాబ్ లేదు.. క్యాలెండర్ కూడా లేదని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత వల్లే కాంగ్రెస్ గెలిచిందని, ఇప్పుడు వారిపైనే కేసులు పెడుతున్నదని మండిపడ్డారు. ఉద్యోగాల సంఖ్య, నోటిఫికేషన్ తేదీలు స్పష్టంగా ఉంటేనే జాబ్ క్యాలెండర్ అవుతుందని, జాబ్ క్యాలెండర్‌పై తన మిత్రపక్షం డీఎంకేను చూసైనా కాంగ్రెస్ నేర్చుకోవాలని చురక అంటించారు. ప్రజాభవన్‌కు వెళ్లిన జీవో 46 బాధితులకు పిడిగుద్దులే మిగిలాయని వెల్లడించారు. జీవో 46 బాధితులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టినా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం స్పందించలేదని, కేటీఆరే ఫోన్ చేసి దీక్ష విరమించాలని కోరినట్టు వివరించా రు. ఉద్యోగాల భర్తీపై కేటీఆర్ సవాల్‌ను కాంగ్రెస్ నేతలు స్వీకరించాలని డిమాండ్ చేశారు.

ఎగుమతుల్లోనూ తెలంగాణ 'టాప్'

- రాష్ట్ర ఉత్పత్తుల్లో 28% అమెరికాకే!
- జర్మనీ, రష్యాకూ ఎగుమతులు
- ఎక్స్‌పోర్ట్స్‌లో ఔషధాలదే అగ్రస్థానం
- ఫార్మా ఉత్పత్తుల వాటా 32 శాతం
- ఔషధ రంగానికి బీఆర్ఎస్ పెద్దపీట
- సేవల రంగంలోనూ దేశ సగటు కంటే అధికం
- ఆర్థిక సర్వేలో వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 4(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదిగిన తెలంగాణ రాష్ట్రం,, ఎగుమతుల్లోనూ తనదైన ముద్ర వేసింది. దేశ ఔషధ రాజధానిగా పేరుగాంచిన హైదరాబాద్ తన పూర్వవైభవాన్ని కొనసాగిస్తూ నిరుడు కూడా భారీగా ఎగుమతులు చేసింది. కేసీఆర్ ప్రభుత్వ పారిశ్రామిక అనుకూల విధానాలతో గణనీయంగా అభివృద్ధి చెందిన ఔషధ రంగం, మొత్తం ఎగుమతుల్లో 32 శాతంతో అన్నింటికన్నా ముందున్నట్టు ఆర్థిక సర్వే వెల్లడించింది. రాష్ట్ర ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్న టాప్-10 దేశాల్లో అమెరికా, రష్యా, యూకే, జర్మనీ తదితర అభివృద్ధి చెందిన దేశాలున్నాయి. రాష్ట్రం నుంచి ఎగుమతుల్లో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఆదాయం, ఉద్యోగావకాశాలు, పెట్టుబడులు తదితర వాటికోసం ఎగుమతుల రంగం ఎంతో ప్రధానమైనది. 2023-24లో సరుకులకు సంబంధించిన ఎగుమతులు రూ. 1,16,182 కోట్లు ఉండగా, ఇందులో అత్యధికంగా రూ. 36,893 కోట్ల విలువైన ఔషధాలు (32శాతం) ఎగుమతయ్యాయి. ఫార్మా తరువాత అత్యధికంగా ఎగుమతి అయిన సరుకుల్లో ఆర్గానిక్ కెమికల్స్, ఎయిర్‌క్రాఫ్ట్, స్పేస్‌క్రాఫ్ట్ విడిభాగాలు, విద్యుత్తు యంత్రాలు, న్యూక్లియర్ రియాక్టర్లు, బాయిలర్లు, మెకానికల్ వస్తువులు ఉన్నాయి. రాష్ట్రానికి చెందిన సరుకులను దిగుమతి చేసుకున్న దేశాల్లో 28.16 శాతంతో అమెరికా ప్రథమస్థానంలో నిలిచింది. 6.9 శాతంతో యూఏఈ, 5.2శాతంతో చైనా ఆ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. జిల్లాల విషయానికొస్తే 29 శాతంతో రంగారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి 2023-24లో రూ. 34,249కోట్ల విలువైన సరుకులు ఎగుమతి అయ్యాయి. రూ. 22 శాతం(రూ.25,444కోట్లు)తో మేడ్చల్ మల్కాజిగిరి, 19 శాతం(రూ. 21,939కోట్లు)తో సంగారెడ్డి, 17శాతం(రూ. 19,435కోట్లు)తో హైదరాబాద్ వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

బయోఫార్మాకు బీఆర్ఎస్ సర్కారు పెద్దపీట

దేశంలో ఉత్పత్తి అవుతున్న ఫార్మా ఉత్పత్తుల్లో మూడింట ఒక వంతు.. ఎగుమతి అవుతున్న ఫార్మా ఉత్పత్తులో ఐదింట ఒక వంతు తెలంగాణ నుంచే కావడం గమనార్హం. దీనిని బట్టి రాష్ట్ర ఎగుమతుల్లో ఫార్మా రంగం ఎంతో కీలకమైనదో అర్థం చేసుకోవచ్చు. దేశంలోనే అతిపెద్ద ఆర్‌అండ్‌డీ క్లస్టర్‌గా పేరుగాంచిన జీనోమ్ వ్యాలీ నుంచే కొవిడ్ వ్యాక్సిన్లు ప్రపంచానికి సరఫరా అయ్యాయి. ఇక్కడ భారత్ బయోటెక్, బయోలాజికల్ ఈ కంపెనీలు వ్యాక్సిన్లు ఉత్పత్తి చేశాయి. ఇక్కడ 200కుపైగా బయోటెక్ కంపెనీలు ఉండగా, వ్యాక్సిన్ తయారుచేసే ఐదు ప్రధాన కంపెనీల్లో నాలుగు ఇక్కడే ఉండడం మరో విశేషం. జీనోమ్ వ్యాలీలో బయోఫార్మా హబ్(బీ-హబ్) ఏర్పాటు మరో కీలకాంశంగా చెప్పుకోవచ్చు. ప్రముఖ లైఫ్ సైన్సెస్ కంపెనీ అయిన సైటివా భాగస్వామ్యంతో ఇక్కడ బయోఫార్మా రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తున్నది. లైఫ్ సైన్సెస్ రంగానికి ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 2,000కోట్ల పెట్టుబడులతో జీనోమ్ వ్యాలీ ఫేజ్-2ను కూడా ప్రారంభించింది. దీంతో మరిన్ని ఫార్మా, లైఫ్ సైన్సెస్ కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటయ్యే అవకాశమున్నది.

సేవల రంగంలోనూ మిన్న

సేవల రంగం విషయానికొస్తే.. 2022-23, 2023-24లో దేశ సగటు వృద్ధిరేటు కన్నా తెలంగాణ రాష్ట్రం ఎంతో ముందుంది. దేశ వృద్ధి రేటు 9.5 శాతం కాగా, తెలంగాణ వృద్ధిరేటు 14.6 శాతంగా ఉంది. స్థూల రాష్ట్ర విలువ జోడింపు(జీఎస్‌వీఏ)లో సేవల రంగం ప్రముఖ పాత్ర పోషిస్తున్నది. ఫైనాన్స్, హెల్త్ కేర్, ఎడ్యుకేషన్, టూరిజం తదితర రంగాలు ఆధునిక సాంకేతికత, డిజిటలైజేషన్, పెరిగిన గ్లోబల్ కనెక్టివిటీ తదితర అంశాల ఆధారంగా గణనీయ వృద్ధిని నమోదుచేశాయి. 2023-24లో సేవల రంగం రాష్ట్ర జీఎస్‌డీపీలో 65.70 శాతం(రూ. 8,80,569 కోట్లు) తోడ్పాటును అందించింది. రాష్ట్ర ఆర్థికరంగంలో సేవల రంగం ప్రముఖమైనదిగా చెప్పవచ్చు. 2022-23, 2023-24లో ట్రేడ్, రిపేర్, హోటల్స్, రెస్టారెంట్స్ తదితర రంగాలు 20.81శాతం వృద్ధిని నమోదుచేశాయి. అలాగే, రవాణా, స్టోరేజ్, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్ తదితర రంగాలు 15 శాతం వృద్ధిని సాధించాయి.

సేవల రంగంలో వృద్ధిరేటు (రూ. కోట్లలో)	2022-23	2023-24	వృద్ధిరేటు
తెలంగాణ	7,68,384	8,80,569	14.6శాతం
భారత్	1,33,60,808	1,46,35,339	9.5శాతం

రాష్ట్రం నుంచి ఎగుమతులు చేసిన టాప్-5 జిల్లాలు(రూ. కోట్లలో)

రంగారెడ్డి	34,249 (29శాతం)
మేడ్చల్ మల్కాజిగిరి	25,444(22శాతం)
సంగారెడ్డి	21,999(19శాతం)
హైదరాబాద్	19,435(17శాతం)
నల్లగొండ	2,961(3శాతం)

రాష్ట్రం నుంచి టాప్-5 ఎగుమతుల వివరాలు(రూ. కోట్లలో)

- ఔషధాలు- 36,893(32శాతం)
- ఆర్గానిక్ కెమికల్స్- 23,257(20శాతం)
- ఎయిర్‌క్రాఫ్ట్, స్పేస్‌క్రాఫ్ట్ పరికరాలు- 15,907(14శాతం)
- ఎలక్ట్రికల్ యంత్రాలు- 7,375(6శాతం)
- న్యూక్లియర్ రియాక్టర్లు, బాయిలర్లు, మెకానికల్ ఉపకరణాలు-4,740(4శాతం)

తెలంగాణ సరుకును దిగుమతి చేసుకున్న టాప్-10దేశాలు(శాతాల్లో)

- యుఎస్ఏ- 28.16
- యూఏఈ- 6.90
- సౌదీ అరేబియా- 4.02
- కువైట్- 3.71
- యూకే- 3.10
- జర్మనీ- 2.10
- రష్యా- 1.88
- బంగ్లాదేశ్- 1.72
- కెనడా- 1.54
- ఇతర దేశాలు- 41.67

ప్రైవేట్ టీచర్ల సంక్షేమ చట్టం తేవాలి

- రేవంత్‌రెడ్డి కించపర్చడం తప్ప
- సీఎం వ్యాఖ్యలు వెనక్కితీసుకోవాలి
- మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ) : ప్రైవేట్ టీచర్ల సంక్షేమం కోసం చట్టం తేవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ప్రైవేట్ టీచర్లను కించపరుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం తప్పు అని, వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలపై త్వరలోనే లక్ష మందితో భారీ సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో ఆదివారం వినోద్‌కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 40,941 పాఠశాలలుంటే వాటిలో 30,307 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్‌లో కలిపి మొత్తం 59.45 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, సర్కారులో 28.95 లక్షలుంటే, ప్రైవేట్‌లో 30.49 లక్షల మంది చదువుతున్నారని వివరించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయిన వారే ప్రైవేట్ పాఠశాలల్లో చదువు చెప్తున్నారడనం సరికాదని హితవుపలికారు. విద్యాహక్కు చట్టం కింద శిక్షణ పొందిన ఉపాధ్యాయులే ఉండాలని, చాలా స్కూళ్లల్లో శిక్షణ పొందిన వారే ఉన్నారని వివరించారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో ప్రైవేట్ టీచర్లకు సంక్షేమ బోర్డు ఉండాలని ప్రైవేట్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినట్టు గుర్తుచేశారు. విద్యా సెస్సు వసూలు చేసైనా ప్రైవేట్ ఉపాధ్యాయులకు సంరక్షణ బోర్డు ఉండాలని చెప్పారు. ప్రైవేట్ టీచర్లకు రిటైర్మెంట్ తర్వాత సాయం అందించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. గతంలో మాజీ స్పీకర్ జీ నారాయణరావు చొరవతో న్యాయవాదులకు సంక్షేమ చట్టం వచ్చిందని, అన్ని రాష్ట్రాల్లో ఇది అమలవుతున్నదని, ప్రైవేట్ టీచర్లకు కూడా సంరక్షణ చట్టం రావాల్సిందేనని చెప్పారు.

పనిచేయని మీటర్‌కూ బిల్లు

- వచ్చిన బిల్లు మేరకు డబ్బులు కట్టాలి
- విద్యుత్తు అధికారుల హుకుం
- లబోదిబోమంటున్న వినియోగదారుడు

ఐనవోలు,ఆగస్టు 4 :పనిచేయని విద్యుత్తు మీటర్‌కూ బిల్ వేశారని ఓ వినియోగదారుడు ఆందోళన వ్యక్తం చేశాడు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తికి చెందిన మేరుగు సురేశ్ ఇంటి మీటర్ పనిచేయడం లేదు. జూలై 6న బిల్ నమోదుకు వచ్చిన సిబ్బంది యావరేజ్ బిల్ కింద 304 యూనిట్ల విద్యుత్తు వినియోగించినట్టు పేర్కొంటూ రూ.1999 బిల్ వేశారు. ఈ విషయమై గత నెలలో అధికారులను వివరణ కోరగా.. మీటర్ పని చేయనందున యావరేజ్ బిల్‌గా నమోదైందని, వచ్చే నెల ఉపయోగించిన బిల్ మాత్రమే వస్తుందని తెలిపారు. ఆ తరువాత వారం రోజుల్లో కొత్త మీటర్ అమర్చారు. ఆదివారం విద్యుత్ బిల్ ఇవ్వగా గత నెలలో వచ్చిన విధంగానే 31 రోజులకు గాను 304 యూనిట్లు విద్యుత్తు వినియోగించినట్టుగా రూ.2002 బిల్ వచ్చిందని బాధితుడు సురేశ్ వాపోయాడు. మీటర్ చూసి బిల్ వేయాలని అడిగినా పట్టించుకోకుండా యావరేజ్ బిల్ నమోదు చేశారని పేర్కొన్నాడు. కొత్తగా అమర్చిన మీటర్‌లో 72 యూనిట్లు మాత్రమే వినియోగించినట్టు తెలిపాడు. బిల్లు కట్టాలని అధికారులు చెబుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై ఏఈ పద్మను వివరణ కోరగా.. వినియోగదారుడు సమస్యను తన దృష్టికి తీసుకొచ్చాడని, రెండు బిల్లులను పరిశీలించి, పరిష్కరిస్తామని తెలిపారు.

- అంగన్‌వాడీలో కుళ్లిన కోడిగుడ్లు

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పిన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారం క్రితం బాలింతలు, గర్భిణులకు కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఆదివారం వాటిని ఉడకబెట్టడంతో కుళ్లిన వాసన వచ్చింది. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తున్నది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవిని వివరణ కోరగా.. కుళ్లిన కోడిగుడ్లను పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని దాటవేశారు. - కోటపల్లి

సీపీఎస్‌ను రద్దుచేయాలి

ఎంపీ అమ్రారామ్

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): సీపీఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రముఖ రైతు నాయకుడు, ఎంపీ అమ్రారామ్ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇబ్బందిగా మారిన సీపీఎస్ రద్దుకు పోరాటాలను ఉధృతంచేయాలని పిలుపునిచ్చారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) కేంద్ర కార్యాలయ నూతన భవనాన్ని ఢిల్లీలోని ఫరీదాబాద్‌లో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు హరిక్రిష్ణన్, జాతీయ ప్రధాన కార్యదర్శులు మయాంక్ బిశ్వాస్, భారతి, ఉపాధ్యక్షుడు రవి, దుర్గాభవాని, జంగయ్య పాల్గొన్నారు.

ఉడకని అన్నం.. నీళ్ల చారు!

- బయ్యారం ఏకలవ్య స్కూల్‌లో విద్యార్థుల అరిగోస
- కనీస అవసరాలకూ నీరు లేక అవస్థలు
- పిల్లల దీనస్థితిని చూసి తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- అధికారుల తీరుపై ఆగ్రహం.. సమస్యలు తీర్చాలని డిమాండ్

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం నామాలపాడు ఏకలవ్య పాఠశాల

బయ్యారం, ఆగస్టు 4: ఉడకని అన్నం.. పురుగులు, రాళ్లు ప్రత్యక్ష్యం.. నీళ్ల చారు.. ఇదీ మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం నామాలపాడు ఏకలవ్య మాడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న భోజనం. ఈ భోజనం తినలేకపోతున్నాం.. తింటే కడుపునొప్పి వస్తుంది.. అని తమ తల్లిదండ్రుల వద్ద ఏడుస్తూ తెలిపిన విద్యార్థుల అరిగోస అంతా ఇంతా కాదు. ఈ పాఠశాలలో ఉండలేక, అక్కడి తిండి తినలేక వారంతా ఇబ్బందులు పడుతున్నారు. నామాలపాడు ఏకలవ్య మాడల్ రెసిడెన్షియల్ పాఠశాలను రూ.35 కోట్లతో అధునాతన హంగులతో నిర్మించి, 2022 డిసెంబర్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడ ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 550 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరు కనీస అవసరాలు తీర్చుకునేందుకు కూడా నీరు లేక నెలరోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం విద్యార్థులను చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులకు విద్యార్థులు తమ దుస్థితిని కండ్లకు కట్టినట్టు వివరించారు.

కంపుకొడుతున్న మరుగుదొడ్లు

పాఠశాలలో చుక్క నీరు లేదని, రోజూ సరిగ్గా స్నానం కూడా చేయడం లేదని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్పుకున్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారి కంపు కొడుతుండటంతో ముక్కు మూసుకొని వెళ్తున్నామని చెప్పారు. దీంతో తాము ఇక్కడ ఉండలేకపోతున్నామని వాపోయారు. అంతేగా కుండా మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, సరిగ్గా ఉడకని, పురుగులు, రాళ్లు ఉన్న అన్నం, నీళ్ల చారు పెడుతున్నారని, ఈ తిండి తినలేకపోతున్నామని, తింటే కడుపునొప్పి వస్తుందని ఏడుస్తూ తెలిపారు. ఇక్కడ ఉండలేమని, ఇంటికి తీసుకెళ్లాలని కొందరు పిల్లలు తమతల్లిదండ్రుల మారాం చేయడంతో విద్యార్థుల దీనస్థితిని చూసిన తల్లితండ్రులు తల్లడిల్లిపోయారు. పాఠశాల దుస్థితిపై విద్యార్థుల తల్లితండ్రులు అసంతృప్తిని, అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. ఇప్పటికైనా అధికారులు సమస్యలను తీర్చాలని కోరారు. ఇటీవల గూడూరు ఏకలవ్య పాఠశాల నుంచి 150 మంది విద్యార్థులను ఇక్కడికి మార్చారని, కొన్ని రోజులపాటు ఉన్న వారు నీటి సమస్య, భోజనం బాగాలేక వారిలో కొందరు వెనుదిరిగి వెళ్లినట్టు సమాచారం.

ఏకలవ్య స్కూల్‌లో ఏండ్లుగా నీటి సమస్య

నామాలపాడు ఏకలవ్య స్కూల్‌లో శాశ్వత నీటి సౌకర్యం కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ ఉన్నారు. ఇక్కడి భూమి పొరల్లో బొగ్గు ఉండటంతో నీటిని ఉపయోగించుకునే వీలు లేదు. విద్యార్థుల అవసరాలకు మిషన్ భగీరథ నీటిని నిల్వచేసి వాడుతున్నారు. భగీరథ నీరు లేనప్పుడు ట్యాంకర్లతో నీటిని తీసుకొచ్చి వాడుతారు. కొన్నిసార్లు నీరు అందుబాటులో లేక విద్యార్థులు రెండు మూడు రోజులపాటు స్నానాలు కూడా చేయని పరిస్థితులు ఉంటున్నాయి. విద్యార్థులు ఇంత ఇబ్బందిపడుతున్నా అధికారులు మాత్రం నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. మరో రూ.15 కోట్లతో సిబ్బంది వసతి కోసం నిర్మిస్తున్న క్వార్టర్ల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి.

నీరు లేక గోస పడుతున్నాం

స్కూల్‌లో నీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. సాయంత్రం ట్యాంకర్లతో నీటిని తీసుకొచ్చి నింపినా ఉదయానికే అయిపోతున్నాయి. కనీస అవసరాలకు కూడా సరిపోవడం లేదు. అన్నం, కూరలు కూడా సరిగ్గా ఉండటం లేదు. ఫ్యాన్లు, లైట్లు పనిచేయడమే లేదు. అధికారులకు చాలాసార్లు చెప్పినా వాటిని పరిష్కరించడం లేదు. - చందన, తొమ్మిదో తరగతి

నా బిడ్డ పరిస్థితి చూసి ఏడుపొచ్చింది..

'అమ్మా వాష్ రూమ్‌కు వెళ్లేందుకు కూడా నీళ్లు లేవు.. ఇక్కడెలా ఉండాలమ్మా. ఇంటికొస్తా తీసుకపో' అని నాబిడ్డ అంటుంటే ఏడుపొచ్చింది. దగ్గరికి తీసుకొని నేనూ ఏడ్చిన. మా అమ్మాయి ఆస్మిత ఏకలవ్యలో ఆరో తరగతి చదువుతున్నది. చూద్దామని హైదరాబాద్ నుంచి వచ్చా. కానీ, ఇక్కడి పరిస్థితి చూస్తే చాలా అధ్వానంగా ఉన్నది. బట్టలు ఉతుక్కునేందుకు కూడా నీళ్లు లేక వారం వారం ఇంటికి తీసుకెళ్లి ఉతికి తీసుకొస్తున్నాం. నీటి ఇబ్బందిపై చాలాసార్లు నిర్వాహకులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉడకని అన్నం పెడుతుంటే కడుపునొప్పితో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

- వనజ, విద్యార్థిని ఆస్మిత తల్లి

రెండు రోజులుగా అన్నం తినలేదు..

భోజనం సరిగ్గా లేక రెండు రోజుల నుంచి అన్నం తినలేదు. అన్నంలో పురుగులు, రాళ్లు వస్తున్నాయి. చాలా గలీజ్‌గా ఉంటుంది. తింటే కడుపునొప్పి వస్తున్నా, తప్పని పరిస్థితుల్లో తింటున్నాం. కూరలు కూడా బాగుండటం లేదు. నీళ్లు లేక టాయిలెట్స్ కంపు కొడుతున్నా, ముక్కుముసుకొని వెళ్లి వస్తున్నాం. సార్లకు చెప్తే వస్తాయిలే.. అంటున్నారు, కానీ రావడమే లేదు.. నీటి సమస్యను పరిష్కరించకుంటే ఇక్కడ ఉండలేము.

- కల్యాణ్, ఏడో తరగతి

మధ్యాహ్న భోజనంలో సర్కారు ఫెయిల్

- విద్యార్థులకు కారం మెతుకులు అమానుషం
- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): విద్యార్థులకు పౌష్టికాహారం అందించే సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అటకెక్కించి, మధ్యాహ్న భోజనం అందించటంలో సర్కారు విఫలమైందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ధ్వజమెత్తారు. విద్యార్థుల భవిష్యత్తుపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరికి ఇదే నిదర్శనమని మండిపడ్డారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఆకలితో ఉన్న విద్యార్థులు అన్నంలో కారం, నూనెతో కలుపుకుని కడుపు నింపుకున్న ఉదంతాన్ని ఆయన ఉదహరించారు. భావిభారత పౌరులపై ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరించడం బాధాకరమని ఆయన ఎక్స్‌వేదికగా విమర్శించారు. మధ్యాహ్న భోజన పథకం భోజన సామగ్రి బిల్లులు, కుక్ కమ్ హెల్పర్ల వేతనాలు పెండింగ్ ఉండడంతో విద్యార్థులకు సరైన భోజనం అందడం లేదని విమర్శించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే స్పందించి, మధ్యాహ్న భోజన పథకం పెండింగ్ బిల్లులను, కార్మికుల జీతాలను చెల్లించి, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల కడుపు నింపాలని ఆయన కోరారు.

కొత్తపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఈవో

'విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టండి'

- మరోసారి ఫిర్యాదు వస్తే ఏజెన్సీ తొలగిస్తాం
- డీఈవో దుర్గాప్రసాద్

కోటగిరి, ఆగస్టు 4 : విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో 'కారం మెతుకులే..' అనే శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు కదిలివచ్చారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్, తహసీల్దార్ గంగాధర్, ఎంఈవో నాగ్‌నాథ్ ఆదివారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి జరిగిన విషయంపై ఆరా తీశారు. కూర ఎందుకు రుచికరంగా చేయలేదని నిర్వాహకులపై డీఈవో ఆగ్రహం వ్యక్తంచేశారు. కారంతో భోజనం పెట్టడంపై విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రశ్నించడంతో తమదే తప్పని నిర్వాహకులు ఒప్పుకున్నారు. భోజనం రుచికరంగా ఉండాలని, మళ్లీ ఫిర్యాదులు వస్తే ఏజెన్సీని రద్దు చేస్తామని డీఈవో దుర్గాప్రసాద్ హెచ్చరించారు.

కోడలితో కలిసి ఉపాధి హామీ పని చేస్తున్న చేనేత కార్మికుడు సామల యాదయ్య

మగ్గం నేసిన చేతుల్తో మట్టి పని

చేనేత సంక్షోభంతో కూలీలుగా నేతన్నలు

**మూలకు మగ్గాలు.. రోడ్డున పడ్డ